మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించిన మంత్రి

-మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు

**హుస్నాబాద్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డు నేతాజీనగర్‌లో గత కొద్ది సంవత్సరాలుగా ప్రజలు విద్యుత్ లోవోల్టేజీతో బాధపడుతున్నారని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెన్నబోయిన విద్యాసాగర్ ద్వారా తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి మంగళవారం విద్యుత్ అధికారులతో మాట్లాడి 10 విద్యుత్ స్తంభాలను వేయించడంతో పాటు వీధి దీపాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను వేయించి సమస్యను పరిష్కరించారు. సంవత్సరాల నుండి ఉన్న సమస్యను పరిష్కరించిన మంత్రితో పాటు సహకరించిన విద్యుత్ అధికారులకు విద్యాసాగర్‌తో పాటు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిగాచి అగ్నిప్రమాదంలో నవదంపతులు మృతి

-రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి, శోకసంద్రంలో ఇరు కుటుంబాలు

**పటాన్‌చెరు, జూలై 1, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పాశమైలారంలో సిగాచి పరిశ్రమ రియాక్టర్ పేలుడుతో మరణించిన వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాద సమయంలో కంపెనీలో పనిచేస్తోన్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆచూకీ గల్లంతైంది. నిఖిల్‌రెడ్డి ఇటీవలే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ ఆషాఢమాసం తర్వాత పెద్దల సమక్షంలో ఘనంగా వేడుక చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం సిగాచి ఔషధ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలకు చెందినవారు శోకసంద్రంలో మునిగిపోయారు.

## అత్యుత్తమ సేవలకు ఎప్పటికీ గుర్తింపు

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



తహసీల్దార్ మన్నన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, జూలై 1, ప్రభాతవార్త:**

అత్యుత్తమ సేవలకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. చిన్నశంకరంపేట తహసీల్దారుగా విధులు నిర్వహించిన అబ్దుల్ మన్నన్ సోమవారం పదవీ విరమణ చేయగా చిన్నశంకరంపేట పట్టణంలోని రాధేశ్యామ్ కల్యాణ మండపంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో చేసిన మంచిపనులు చిరస్థాయిగా ఉంటాయని అన్నారు. సుదీర్ఘకాలం క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందడం అభినందనీయమన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమన్నారు. ఆయన పదవీకాలంలో నీతి, నిజాయితీతో పనిచేశారని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మంచిపేరు సంపాదించుకున్నారని పలువురు అభినందించారు. తహసీల్దార్ మన్నన్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన అందరితో మంచి అనుభవం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తనకు సహకరించారని, విధి నిర్వహణలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదవీవిరమణ పొందుతున్న తహసీల్దార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, వివిధ మండలాల తహసీల్దార్‌లు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతిచెందిన కార్మికుల కుటుంబీకులకు తక్షణ ఆర్థికసాయం అందజేసిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

-13మంది మృతిచెందిన కార్మికుల గుర్తింపు



మృతిచెందిన కార్మికుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**పటాన్‌చెరు, జూలై 1, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.లక్ష జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం అందజేశారు. అగ్నిప్రమాద ఘటనలో 36మంది కార్మికులు మృతి చెందగా ఇప్పటివరకు 13మంది కార్మికులను గుర్తించారు. వారిమృతదేహాలకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కార్మికుల కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద రూ.లక్ష కలెక్టర్ అందజేశారు.

## పరిశ్రమ యజమాన్యానికి నోటీసులు



చందంపేటలోని ఫోం యాజమాన్యానికి నోటీసులు అందిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జూలై 1, ప్రభాతవార్త:**

మండల పరిధి చందంపేట శివారులో ఫోం పరిశ్రమ ఏర్పాటు చేయకూడదని నాలుగు రోజుల క్రితం గ్రామస్థులు పరిరిశ్రమ ముందు నిరసన వ్యక్తంచేశారు. ఈమేరకు సోమవారం గ్రామస్థులు ప్రజావాణిలో దరఖాస్తులు అందించారు. ఎంపివో గిరిజారాణి, పంచాయతీ అధికారులతో పనులు నిలిపివేయాలని యాజమాన్యానికి మంగళవారం నోటీసులను అందించారు. పూర్తి విచారణ చేపట్టిన తరువాత జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని ఎంపివో తెలిపారు.

## వ్యక్తిని హత్య చేసిన 8మంది అరెస్టు



పోలీసుల అదుపులో వ్యక్తిని హత్య చేసిన 8మంది నిందితులు

**సిర్గాపూర్, జూలై 1, ప్రభాతవార్త:**

భూతగాదాలతో వ్యక్తిని హత్యచేసిన 8మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం కురుమ సాయిగొండ కుటుంబానికి కూర్మ రమేష్ కుటుంబానికి గతంలో భూమి తగాదాలు ఉన్నాయి. రమేష్, జైపాల్‌లు ఇద్దరు కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లగా సాయిగొండ షెడ్డు వద్దకు చేరుకోగానే సాయిగొండ, సాయిగొండ కుమారులు హన్మకొండ, రాజు, పండరి, అతని భార్య కిష్టవ్వ, కోడళ్లు కవిత, వసుధ, దాగొండలు కలిసి కట్టెలు, గొడ్డళ్లతో జైపాల్‌పై దాడి చేసి హత్యచేసిన విషయం పాఠకులకు విదితమే.

రమేష్‌పై దాడి చేస్తుండగా అక్కడికి చేరుకున్న అమ్మ మాణెమ్మ, గ్రామస్థులు చూసి, చేసిన అల్లర్లకు దుండగులు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం జైపాల్‌ను హత్యచేసిన 8మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు.

# భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

-ఇస్నాపూర్లో ప్రభుత్వ ట్రామా కేర్ ఏర్పాటు చేయండి
-అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాద బీమా కల్పించండి
-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి సిగాచి ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, జూలై 1, ప్రభాతవార్త:**

సిగాచి పరిశ్రమ దుర్ఘటనను ఒక గుణపాఠంగా తీసుకుని రాబోయేరోజుల్లో పటాన్‌చెరు నియోజక వర్గ పరిధిలోని ఫార్మా, కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలలో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు రూ.50లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం సిగాచి పరిశ్రమను సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్‌బాబులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ సందర్శించారు. దుర్ఘటన జరిగిన పరిశ్రమలోని వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ పలు అంశాలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామికవాడగా పాశమైలారంలో వేలాది బల్క్ డ్రగ్స్, ఫార్మా, కెమికల్ పరిశ్రమలు తమ ఉత్పత్తులను కొనసాగిస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా పలుపరిశ్రమలలో భద్రతాప్రమాణాలు పాటించకుండా శిక్షణలేని దినసరి కార్మికులతో రియాక్టర్లు, బాయిలర్లు నడిపిస్తున్నారని, దీని మూలంగా భారీప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. యాజమాన్యాల కక్కుర్తిమూలంగా కార్మికులు తమప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనిచేయాల్సిన దారుణపరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ఈఅంశంలో ప్రభుత్వం ప్రత్యేకకమిటీని నియమించి పూర్తిస్థాయిలో తనిఖీలుచేపట్టి, భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలుచేపట్టాలని కోరారు. పటాన్‌చెరులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిద్ధం అవుతున్నప్పటికీ, ఇస్నాపూర్‌లో రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వట్రామాకేర్‌సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ట్రామా కేర్ ద్వారా ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే సత్వరవైద్యం అందించగలుగుతామని తెలిపారు. అదేవిధంగా దేశంలోని వివిధరాష్ట్రాలకుచెందిన పేదప్రజలు పొట్టకూటి కోసం స్థానికపరిశ్రమలలో దినసరికూలీలుగా పని చేస్తున్నారని, వారికి ప్రత్యేకవిభాగాన్ని ఏర్పాటు చేయడంతోపాటు 50లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందించేలా యాజమాన్యాలకు ఆదేశాలుజారీచేయాలనికోరారు. అనంతరం పటాన్‌చెరుపట్టణంలోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు.

# సిగాచి పరిశ్రమను పరిశీలించిన కేంద్రమంత్రి

-పాశమైలారం ఘటన దేశాన్ని కలచివేసింది
-కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి



సిగాచి పరిశ్రమను సందర్శించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**పటాన్‌చెరు, జూన్ 1, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటన దేశాన్ని కలిచివేసిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈసంఘటన చాలా దురదృష్టకరమైన సంఘటనగా అభివర్ణించారు. మంగళవారం బిజెపి తెలంగాణరాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, పట్టభద్రులు ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిలతో కలిసి ఘటన జరిగిన స్థలాన్ని సందర్శించారు.

అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటివరకు 48మృత దేహాలు వెలికితీయబడినట్టు తెలిపారు. ఇంకా 11 మంది ఆచూకీ లభించాల్సి ఉందని వెల్లడించారు. సహాయకచర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గతంలోనూ ఇలాంటి ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి 11మంది మృతి చెందారని గుర్తుచేశారు. పరిశ్రమలపై తనిఖీల మోతాదు పెంచాలని సూచించారు. ఈతరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. పరిశ్రమలలో తనిఖీలు నిజంగా జరుగుతున్నాయా, లేక కేవలం లంచాల కోసమేనా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. పరిశ్రమల తనిఖీల ప్రక్రియను పటిష్టంగా మార్చాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు. సిగాచి సంస్థకు చెందిన మరో మూడు పరిశ్రమలనూ తనిఖీచేయాలని సూచించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పేదవారు పొట్టకూటి కోసం వస్తూ ప్రాణాలుకోల్పోవడం బాధాకరమని ఆయన అన్నారు.

**ప్రభుత్వ సహాయం, కేంద్రం నుంచి భరోసా..**

ప్రమాదంలో మృతుల జాబితా వచ్చిన వెంటనే సంబంధిత రాష్ట్రాల్లో తమ పార్టీ తరపున మద్దతు ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాల కోసం పోలీస్ జాగిలాలను వినియోగించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఎప్పుడైనా అత్యవసరపరిస్థితుల్లో ఉపయోగపడేలా అంబులెన్స్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రప్రభుత్వం తరపున అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇది రాజకీయాల సమయం కాదని, బాధితులకు న్యాయం చేయడం ప్రధానమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

# కాలువల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరగాలి

-భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి అవరోధాలు ఎదురైనా పక్కా ప్రణాళికతో పకడ్బందీగా పూర్తిచేయాలి
-జిల్లా కలెక్టర్ హైమావతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని రిజర్వాయర్‌ల ద్వారా ఆయకట్టుకు నీటిని అందించడానికి కాలువల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి లాంటి రిజర్వాయర్‌ల నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి వివిధ ప్యాకేజీల ద్వారా జిల్లాలోని ప్రతి చెరువులో నీటిని నింపడానికి కావాల్సిన భూసేకరణపై మండలాల వారీగా అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధప్యాకేజీలలో భూసేకరణకు నిధులు విడుదల చేసినవి, పెండింగ్ ఎంత అనే విషయాలను ఆయాగ్రామ మండలాల వారీగా పూర్తి సమాచారాన్ని ఆర్డీఓలు ఇవ్వాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, సర్వేయర్‌ల పాత్ర కీలకం అన్నారు. గ్రామాల్లో మండల తహసీల్దార్, సర్వేయర్లు ఆర్డీఓల సహకారంతో కాలువల భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వేయర్ అందించిన భూసేకరణ సంబంధిత ఇరిగేషన్ అనుమతులను వెంటనే తహసీల్దార్‌లకు అందించిన వెంటనే రైతులకు నష్ట పరిహారం అందజేసి భూమిని అధీనంలోకి తీసుకోవాలని అనంతరం నీటి పారుదలశాఖ అధికారులకు అందించి కాలువల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరగాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి అవరోధాలు ఎదురైనా పక్కా ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, ఆర్డీఓలు చంద్రకళ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

-వసతిగృహాలను తనిఖీచేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్



వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**టేక్మాల్, జూలై 1 ప్రభాతవార్త:**

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నదే ప్రభుత్వలక్ష్యమని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా టేక్మాల్ మండలం షెడ్యూల్‌కులాల అభివృద్ధిశాఖ వసతిగృహాన్ని, బిసి బాలుర వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్‌రాహుల్‌రాజ్ పరిశీలించారు. వంటగది, మరుగుదొడ్లను, విద్యార్థులు నిద్రించే గదులను, పరిశీలించిన అనంతరం స్టోర్ రూమును తనిఖీచేసి కోడిగుడ్ల బరువును పరిశీలించారు. అదేవిధంగా పల్లీల నాణ్యత, ఆయిల్ ప్యాకెట్ తయారీ తేదీలను పరిశీలిస్తూ, వస్తువులను దిగుమతి చేసుకున్నప్పుడు పరిశీలించి తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. ముందుగా విద్యార్థులు తృప్తిగా భోజనం చేయాలంటే మెనూ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం నాణ్యమైన భోజనానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే చదువుపై మరింతశ్రద్ధ పెరుగుతుంది అని చెప్పారు. విద్యార్థులతో మాట్లాడి మెనూపై వారి ఇష్టాయిష్టాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులసామర్థ్యాలు పరీక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం బిసి సంక్షేమశాఖ గృహాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవిన్యూ సదస్సులు నిర్వహించి తీసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ మాడ్యూల్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో టేక్మాల్ తహసీల్దార్ తులసీరాం, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్, గిర్దావర్ సాయి శ్రీకాంత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాట్‌లలోనే 11 కెవి స్తంభాలు బిగింపు

-పట్టించుకోని విద్యుత్ అధికారులు



ప్లాట్‌లలో బిగించి ఉన్న స్తంభాలు

**నారాయణఖేడ్, జూలై 1, ప్రభాతవార్త:**

మంగల్‌పేట పరిధిలోని మున్సిపల్ ఆఫీస్ వెనకాల గల వెంచర్లో కాంట్రాక్టర్ వెంకటరెడ్డి గత కొన్ని రోజులుగా 11 కెవి స్తంభాలు మున్సిపల్ రూల్స్‌కు విరుద్ధంగా ప్లాట్‌లలోనే ప్లాట్ల మధ్యలో నుండి వైరు వచ్చేవిధంగా 11 కెవి స్తంభాలను బిగించినారు. దీనిపై విద్యుత్ అధికారులకు నారాయణఖేడ్ ఎఈ, ఎడికి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. దీనిపైన విచారణ చేసి తొలగిస్తామని చెప్పినారు. కాని ఇంతవరకు స్తంభాలను తొలగించలేదు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డికి సైతం చెప్పడం జరిగినది. అయినా తొలగించడం లేదు. దీనిపైన ఉన్నతాధికారులు స్పందించి 11 కెవి స్తంభాలను తొలగించాలని ప్లాట్ల యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వావిలాలలో ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**-ముఖ్య అతిథులుగా కాటా శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి**



కళ్యాణోత్సవంలో కాటా శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి

**జిన్నారం, జూలై 1, ప్రభాతవార్త:**
మండలం వావిలాల గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో వెలసిన ఎల్లమ్మ తల్లి ఆలయంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనాల మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకర్షించాయి. ఈ బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొడకంచి మాజీ ఉపసర్పంచ్ అభిలాష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

**-ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసన్నకుమార్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్ డిమాండ్‌చేశారు. ఈమేరకు మంగళవారం డిఐఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అకాడమీల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా కళాశాల నడుపుతున్న యజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. దీక్ష అకాడమీ పేరుతో కళాశాలను అందులో రెసిడెన్షియల్‌హాస్టల్ వసతికల్పిస్తూ ఎలాంటి అనుమతులులేకుండా నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్య పేరుతో వ్యాపారం చేస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈవిషయమై డిఐఈవో సానుకూలంగా స్పందించారని త్వరలోనే తనిఖీలుచేస్తామని చెప్పినట్లువివరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి కల సాకారం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపత్రాలను అందజేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జూలై 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు సేవాదళ్ మండల అధ్యక్షులు అరకల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో పేదింటికల సహకారం అవుతుందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు సందవేని పరుశురాములు, లింగంపల్లి నాగరాజు, కల్లూరి నర్సయ్య, గొల్లపల్లి కిష్టయ్య, పసువుల బాబు, కార్యదర్శి కనకరాజు,గ్రామస్తులు అశోక్, లక్ష్మీరాజ్యం, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలి

**-గజ్వేల్ ఏసిపి కె.నర్సింలు**



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీచేస్తున్న ఎసిపి నర్సింలు

**మర్కుక్, జులై 1 (ప్రభాతవార్త):**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ముందస్తు సమాచారాన్ని సేకరించాలని గజ్వేల్ ఏసిపి కె.నర్సింలు తెలిపారు. మంగళవారం మర్కుక్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన అకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి రికార్డులను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఎసిపి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని, విధులపట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని, సైబర్‌నేరాల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా సమాచారం అందజేయాలని తెలిపారు. విపిఓ వ్యవస్థను మెరుగుపర్చాలని, వారంలో మూడుసార్లు గ్రామాలను సందర్శించాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగించాలని, కెడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై మరింత నిఘా పెంచాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌వర్క్ ప్రతిరోజు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్, ఏఎస్ఐలు రవీందర్, అమృత్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యవృత్తి అత్యంత పవిత్రమైనది

**-ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**



ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జులై 1 (ప్రభాతవార్త):**
వైద్యవృత్తి అత్యంత పవిత్రమైనదని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ మేధా, లయన్స్ క్లబ్ ఆఫ్ విస్డం, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని వైద్యులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం మొక్కలునాటడంతోపాటు నిరుపేదలకు గొడుగులు, గర్భిణీస్త్రీలకు పండ్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్నసేవలు అభినందనీయని, ప్రతిసంవత్సరం వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషమని, లయన్స్‌క్లబ్‌సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు.

# గాలిలో దీపంలా కార్మికుల జీవితాలు

**-మాటలకే పరిమితమవుతున్న నష్ట నివారణ చర్యలు**



సిగాచి పరిశ్రమలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

**సంగారెడ్డి బ్యూరో, జులై 1, ప్రభాతవార్త:**
పరిశ్రమల్లో కార్మికుల జీవితాలు గాలిలో దీపం లాగా మారాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ గత అనుభవాలతోటి భవిష్యత్తులో జరగబోయే నష్టనివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు అని బాధిత కుటుంబీకుల సభ్యులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు చూపిస్తున్న హడావిడి,హంగు ఆర్భాటం, తర్వాత షరా మామూలుగా మారిపోతుందని వారు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల్లో కార్మికులు ప్రమాదాల వల్ల చనిపోతున్నప్పుడు మాత్రమే, కఠినచర్య తీసుకుంటామని నివారణ చర్య తీసుకుంటామని ముందుజాగ్రత్తలు తీసుకుంటామని పరిశ్రమల యాజమాన్యాలకు సూచనలు చేస్తామని, కఠినచర్యలు తప్పవని చెప్పడం తప్ప ఆచరణలో చేసిచూపెట్టింది ఏమీలేదని పరిశ్రమలలో పనిచేస్తున్న బాధిత కుటుంబీకులు విమర్శిస్తున్నారు. ఆసియాఖండంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడ సంగారెడ్డి జిల్లాలోనే ఉంది. ఇక్కడ వందలాది పరిశ్రమలలో, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కార్మికులతో పాటు, ఉత్తర భారతదేశం దక్షిణ భారతదేశానికి చెందిన వివిధ రాష్ట్రానికి చెందిన కార్మికులు వందలసంఖ్యలో ఉపాధి నిమిత్తం వచ్చి పరిశ్రమలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ, ఉపాధికోసం పనిచేయక తప్పడం లేదని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల శ్రేయస్సుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని వారు విమర్శిస్తున్నారు. పాషా మైలారం పారిశ్రామిక అవార్డులోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో పదుల సంఖ్యలో కార్మికులు మృతిచెందిన ఘటన, రాష్ట్రంతోపాటు దేశంలోనే సంచలనం కలిగించింది. ఒక పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇంతమంది కార్మికులు, ఒకేసారి మృతిచెందడం ఇంతకుముందు తాను ఎప్పుడూ చూడలేదని ఒకసీనియర్ కార్మికుడు తెలిపారు. గత సంవత్సరం ఏప్రిల్ 3న, హత్నూరమండలం చందాపూర్‌గ్రామ పరిధిలోని ఎస్‌బి ఆర్గానిక్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో, పరిశ్రమ డైరెక్టర్‌తో పాటు ఆరుమంది కార్మికులు మృతిచెందారు. ఈఘటన అనంతరం సంబంధిత అధికారులు, నాయకులు సందర్శించడం పరామర్శించడంతోపాటు, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని, సీనియర్ అధికారి పర్యవేక్షణలో ఇక ముందు జరగబోయే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిటీనివేదిక ఇస్తుందని హడావిడిగా ప్రకటించారు. సీనియర్ అధికారి సమక్షంలోని కమిటీ ఇంతవరకు ఏంచేసిందో ఏంచర్యలు తీసుకుందో ఇప్పటికీ దానికి అతీగతీ లేదు. కమిటీ ఉందనే సంగతిని స్థానిక కార్మికులు మరిచిపోయారు. ఎలాంటి నష్టనివారణ చర్యలు తీసుకోవాలో కూడా చెప్పే నాథుడే కరువయ్యాడని, నాయకులు సంబంధిత అధికారులు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేకుండా పోతుందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం చెల్లించడం మినహా, నష్టనివారణకు కఠినచర్యలు తీసుకోవడంలో నాయకులు, అధికారులు విఫలమవుతున్నారని వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తమవిధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చునని, కాని అధికారుల విధినిర్వహణలో మార్పులు రానంతవరకు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని, వాటిని మనం చూస్తూనే ఉంటామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాల కాసులకు కక్కుర్తిపడకుండా, కళ్లుతెరిచి ప్రమాదాల నివారణకు గట్టిచర్యలు తీసుకోవాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఘటనలో 42కి చేరుకున్న మృతుల సంఖ్య..**

సిగాచిఇండస్ట్రీస్ భారీపేలుడు ఘటనలో మృతుల సంఖ్య 42కి చేరింది. అయితే ఈప్రమాదంలో గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటం, పేలుడు శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉన్నారనే అనుమానాల నేపథ్యంలో మృతులసంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పరిశ్రమను తనిఖీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాయిలర్లను తనిఖీచేసి ఏమైనా సమస్యలు గుర్తించారా, బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలుచేశారా అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటిచర్యలు తీసుకోవాలనేదానిపై అధ్యయనంచేయాలని అధికారులకు సూచించారు. ఈపరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తిస్థాయినివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. ప్రమాదఘటనపై నివేదికకోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్రనివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమాసదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరాతీశారు. సిగాచి పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నిపరిశ్రమల్లో తనిఖీలుచేపట్టాని స్పష్టంచేశారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టంచేశారు. పరిశ్రమలో పనిచేసేవారి నైపుణ్యాల గురించి సిఎం ఆరాతీశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా, యాజమాన్యం ఘటనాస్థలికి రాకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ప్రమాదఘటనను కార్మిక, వైద్యశాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సిఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## చెరువులకు వెళ్లే నీటికి అడ్డుకట్ట..

**-మోహన్‌నాయక్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు**



తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**రామాయంపేట, జూలై 1, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలోని ప్రధాన చెరువులైన కొచ్చేరువు, మల్లె చెరువు, వెంకన్నగారి చెరువు, సాయి చెరువులతో పాటు పట్టణ వర్షపు నీరు పెద్ద ఎత్తున వెళ్లే ప్రాంతంలో లీలా గ్రూప్ చైర్మన్ మోహన్ నాయక్ అడ్డుగా కట్ట వేస్తున్నారని, దీనివల్ల, వర్షాకాలంలో తమ కోళ్ల ఫామ్‌లోకి పెద్ద ఎత్తున నీరు చేరే ప్రమాదం ఉందని బేతి రామచంద్రరెడ్డి అనే వ్యక్తి సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.తన సొంత భూమి అని చెబుతూ మోహన్ నాయక్, తమ కోళ్ల ఫామ్ లకు ఆనుకొని ఈ కట్టను నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కట్టకు ఆనుకొని ఉన్న తమ కోళ్ల ఫామ్‌లోకి వర్షాకాలంలో భారీగా నీరు చేరి నష్టం వాటిల్లే అవకాశం ఉందని రామచంద్ర రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారులు ఈఫిర్యాదుపై ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

## సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్**



నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేసి, స్ప్రే చేయిస్తున్న కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:**
సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం 100రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణంలోని 5వ వార్డులో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్‌బాల్స్ వేయడంతోపాటు స్ప్రేచేసి బ్లీచింగ్ చల్లించారు. అనంతరం ఇంటింటికీతిరుగుతూ ప్రజలు నీటిని ఇళ్లలో నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం 9వ వార్డు ఆరెపల్లి చౌరస్తాలో మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి మాజీ కౌన్సిలర్ మ్యాదరబోయిన శ్రీనివాస్‌తోకలసి మొక్కలునాటారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాలఎల్లం,పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్లతోపాటు ఉన్నారు.

## డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితవైద్యశిబిరం

**చేర్యాల, జూలై 1, ప్రభాతవార్త:**
అంతర్జాతీయ డాక్టర్స్‌డే సందర్భంగా చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ (సిడిఏ) ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ కార్డియాలజిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ సికింద్రాబాద్ వారు ఉచితవైద్యశిబిరం నిర్వహించారు.మంగళవారం పట్టణంలోని అక్షరహాస్టల్‌లో ఈకార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా చేర్యాల సిఐ శ్రీనుపాల్గొని మాట్లాడారు.వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం చాలాసంతోషకరమని తెలిపారు.అంతకుముందు ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో జాతీయరహదారిపై ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎస్సై నీరేష్, డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్, సంతోష్‌కుమార్, రఘునందన్ నాయకులు పూర్మ ఆగంరెడ్డి, మాజీ జెడ్పీటీసి దాసరి కళావతి, పూర్మ వెంకట్‌రెడ్డి,దాసరి శ్రీకాంత్,మేడిశెట్టి శ్రీధర్,ముస్త్యాల నాగేశ్వర్‌రావు,అందె అశోక్,నాగరాజు,తదదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాలకు మేలు చేకూర్చే ప్రభుత్వం కాంగ్రెస్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జులై 1, ప్రభాతవార్త:**
అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిటుకుల శివారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేవిధంగా ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశల వారీగా నెరవేరుస్తూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించే బృహత్తర కార్యక్రమం ప్రారంభమైందన్నారు. దశలవారీగా ప్రతి ఒక్క నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే విధంగా సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కృషి చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవితేజ, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ బిజెపి నూతన అధ్యక్షుడి ఎన్నిక కార్యక్రమంలో వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్



కార్యక్రమంలో పాల్గొన్న వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, నాయకులు

**నర్సాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
హైదరాబాదులో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్నిక కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్‌తోపాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, మండల అధ్యక్షులు సంతోష్ చారి, అవినాష్‌రెడ్డి, నర్సాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘసాని రాజు, మండల సీనియర్ నాయకులు నాగేష్‌గౌడ్, రంజిత్‌రెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దంతాలను రక్షించుకుంటే అన్ని అవయవాలు రక్షించుకోవచ్చు

**-దంతవైద్య నిపుణులు అరవింద్**

**సిద్దిపేట అర్బన్, జూలై 1, ప్రభాతవార్త:**
నోటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్‌అరవింద్ విద్యార్థులకు, తల్లిదండ్రులకుసూచించారు. వైద్యులదినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి మందులను,బ్రష్,టూత్‌పేస్టులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవునికిసోకే అన్ని రోగాలకు కారణం దంతాలని..దంతాలను రక్షించుకుంటే అన్ని అవయవాలు రక్షించుకోవచ్చని తెలిపారు. దంతాలలో నొప్పివేస్తే అశ్రద్ధ చేయొద్దని.. వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. దంతాలతో పాటు చిగుళ్లను రక్షించుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం కచ్చితంగా బ్రష్‌చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, వైద్యులు స్పందనరాణి, నవీన్,రమా, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, రమేష్,షాదుల్లా,హనుమంతరెడ్డి,స్వప్న, అనురాధ పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

**-మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి**

**సిద్దిపేట అర్బన్, జూలై 1, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని నాంచారుపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం సుజాత తన స్వంత డబ్బులు రూ.25 వేల విలువ చేసే స్కూల్ షూలను 130 మంది విద్యార్థులకు ఎంఈవో చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ షూ అందించిన హెచ్‌ఎం సుజాతను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనగామ శ్రీనివాస్, చెగురి దేవరాజు,అమిత, స్రవంతి, అవుచర్ల చంద్రమౌళి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు



ఫాం ఆయిల్ తోటను పరిశీలిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జూలై 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ఫాం అయిల్ సాగుపైన ఆసక్తి గల రైతులతో మంగళవారం రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి జయంత్‌కుమార్, విస్తరణ అధికారి అశోక్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని బండిపల్లి శ్రీనివాస్ సాగు చేసిన ఫాం ఆయిల్‌తోటను సందర్శించారు. ఈసందర్భంగా రైతులసందేహాలను నివృత్తి చేసి అయిల్‌ఫాం పంటను సాగు చేయడానికి ముందుకు రావాలని వారు సూచించారు.మొదటి 3 యేండ్ల ఆదాయం కోసం అంతర పంటలు సాగు చేసుకోవాలన్నారు. అయిల్‌ఫాం మొక్కలు నాటిన తర్వాత 4 యేండ్లకు కాపు ప్రారంభమై 30 యేండ్ల వరకు నిరంతరం దిగుబడితో ఆదాయం వస్తుందన్నారు. తెగుళ్లు,చీడపీడల బాధలేదని తుఫాను, వడగండ్ల వానలను తట్టుకుంటుందన్నారు. కోతులు, అడవిపందులబెడద అసలే ఉండదన్నారు. ప్రస్తుతం అయిల్‌ఫాం టన్ను ధర రూ.21000 ఉందన్నారు. ఆయిల్‌ఫాంసాగుతో అధిక లాభాలు ఉన్నాయని వివరించారు.

## కిష్టయ్యకు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే

**-రెండు లక్షల ఆర్థిక సాయం అందజేత..**

**పాపన్నపేట, జూలై 1, ప్రభాతవార్త:**
ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్త బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కిష్టయ్య గుండెపోటుతో సోమవారం మరణించడం చాలా బాధాకరమని మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.. పాపన్నపేట మండల పరిధిలోని పాతలింగాయిపల్లి గ్రామానికి చెందిన ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్త బిఆర్ఎస్ నాయకులు కిష్టయ్య భౌతిక కాయనికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే యం.పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జిల్లానాయకులు కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి, మండలనాయకులు, ఈసందర్భంగా కిష్టయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కిష్టయ్య భార్య రాణిని ఓదార్చి మనోధైర్యాన్ని చెప్పారు. వీరితోపాటు పాపన్నపేట మండలపార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షులు సోములు, ఏడుపాయలదేవస్థానం మాజీచైర్మన్ బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగన్,మండల నాయకులు, మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్‌లు, నాయకులు రూ. 1,50,000/ మాజీ ఎమ్మెల్యే యం.పద్మాదేవేందర్‌రెడ్డి రూ.50,000 కిష్టయ్య కుటుంబానికి అందజేశారు.

## ఆలయ మరమ్మతులకు ఆదర్శ్‌రెడ్డి ఆర్థికసహాయం

**రామచంద్రాపురం, జూలై 1, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని మందుములపోచమ్మ ఆలయ మరమ్మతులకు బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి 75వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఆలయంలో బోనాల సందడి నెలకొననుండంతో ఆలయ మరమ్మత్తులకు ఆదర్శ్‌రెడ్డి ఆలయ కమిటి బాధ్యులకు తన వంతుగా ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, సర్కిల్ అధ్యక్షులు పరమేష్‌యాదవ్,బల్ల నర్సింగ్,కుమార్,అప్పల భాస్కర్ పాల్గొన్నారు.

## అన్నిసౌకర్యాలతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ విద్య

**-శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:**
ప్రస్తుత విద్యాసంవత్సరం నుండే హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ చేసే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ప్రారంభం కానున్న శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలోనే హుస్నాబాద్‌లో నాలుగు కోర్సులతో 60 సీట్ల చొప్పున మొత్తం 240సీట్లతో పాలిటెక్నిక్ కళాశాల మొదటి అంతస్తులో తాత్కాలికంగా ప్రారంభమౌతుందన్నారు. ఇంజనీరింగ్ వెబ్ కౌన్సిలింగ్‌లో ఆసక్తిగలవిద్యార్థులు హుస్నాబాద్‌లోఅడ్మిషన్‌కోసం ఎస్‌యుసిఈ కోడ్‌తో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సామర్థ్యంతో ఈసిఈ, సిఎస్ఈ, ఐటి, ఏఐ నాలుగు కోర్సులకు 54మంది బోధన సిబ్బందిని నియమించడం జరిగిందని, ప్రతిరోజు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు కళాశాల నడుస్తుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను పూర్తి చేశామన్నారు.

## మీడియా స్వేచ్ఛను కాపాడుకుందాం

**-మహాన్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించిన ఖేడ్ జర్నలిస్ట్ జెఎసి**

**నారాయణఖేడ్, జూలై 1, ప్రభాతవార్త:**
మీడియా స్వేచ్ఛను కాపాడుకుందమని నారాయణఖేడ్ జెఎసి నాయకులు అమృత్,హాలీం,మధుఅన్నారు.మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలో నారాయణఖేడ్ జర్నలిస్ట్ జెఎసి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డిఓ మెమోరాండం అందజేసిన జర్నలిస్ట్ సంఘాలు స్థానిక గెస్ట్‌హౌస్ నుండి రాజీవ్‌చోక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఆర్డీవో మెమోరాండం అందించారు. ఈసందర్భంగా జర్నలిస్ట్‌నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మహాన్యూస్ టివి కార్యాలయంపై టిఆర్ఎస్ కార్యకర్తలు జరిపిన దాడిని ఖేడ్ జర్నలిస్ట్ జెఎసి తీవ్రంగా ఖండించింది. ఈదాడిని మీడియాస్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తూ, అది పాశవిక చర్యగా విమర్శించారు. మీడియా కథనాలపై అభ్యంతరాలుంటే చట్టపరంగా స్పందించాలి కాని భౌతిక దాడులకు దిగడం కంటే దుర్మార్గం మరొకటి లేదు అని ఖేడ్ జర్నలిస్ట్ జెఎసి ప్రతినిధులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.మీడియా హక్కులకు భంగం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రింట్,ఎలక్ట్రానిక్‌మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## సిగాచి ప్రమాదంపై న్యాయవిచారణ జరిపించాలి

**-ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జులై 1, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నియోజకవర్గం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పదులసంఖ్యలో కార్మికులు మరణించడంతోపాటు, అనేకమంది తీవ్రంగా క్షతగాత్రులైన సంఘటనపై సమగ్ర న్యాయచారణ జరిపించాలని ఐఎఫ్‌టియు సంగారెడ్డి జిల్లాకమిటీ డిమాండ్‌చేస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నానిర్వహించి, అనంతరం డిఆర్‌వోకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో జి.అనురాధ, శివబాబు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం. సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ, జిల్లా నాయకులు టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు హటావో జంగల్ బచావో

-147వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు



డిఐఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 1, ప్రభాతవార్త:**
ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యు)కు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా, రాష్ట్రప్రభుత్వం, జిల్లాయంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమని నల్లవల్లి రైతు జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామ శివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 147వ రోజుకు చేరుకుంది. గతప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ప్రస్తుతప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు జెఎసి నాయకులు, మహిళా సభ్యులు ఏరా నగర్, నల్లవల్లి, కొత్తపల్లి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

-జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిపివో

**అక్కన్నపేట, జూలై 1, ప్రభాతవార్త:**
ప్రజలు తమపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరి, బొడిగెపల్లి, గౌరవెల్లి, జనగామ, అంతకపేట గ్రామాలలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాలను అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాలలో మురుగుకాల్వలు శుభ్రం చేస్తున్నారా లేదా, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారా లేదా పరిశీలించడంతోపాటు క్లోరినేషన్‌చేసే పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయాగ్రామాలలోని నర్సరీలను పరిశీలించి తీసుకోవాల్సిన సూచనలను గురించి అధికారులకు వివరించారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని పరిశీలించే వారికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డిఎల్‌పివో వెంకటేశ్వర్లు, ఎంపిడివో జయరాంనాయక్, ఎంపివోతోపాటు తదితరులు ఉన్నారు.

## 30యేళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ

-ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, జూలై 1, ప్రభాతవార్త:**
పద్మశ్రీ మంద కృష్ణమాదిగ 30యేళ్ల పోరాట ఫలితంగానే వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని ఎంఎస్పి జాతీయ కమిటీ సభ్యులు, దళిత రత్న అవార్డ గ్రహీత, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జిల్లాకార్యదర్శి కొలిమి మల్లేశంమాదిగ అన్నారు. మండలపరిధిలోని పొన్నాలగ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమిపూజ చేసి అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగజాతి కోసమే కాకుండా సమాజంలో ఉన్న అన్ని వర్గాల పేదప్రజల కోసం ఎన్నో పోరాటాలుచేసి ఫలితాలను సాధించిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కుతుందన్నారు. ప్రతిగ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుర్గయ్య, యాదగిరి, రాజు, మల్లేశం, ప్రశాంత్, యాదగిరి, రాములు, కిషన్, బాబు, ధర్మేందర్, యాదగిరి. విజయ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపిడిఓ శ్రీకారం



ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఎంపిడిఓ హైమద్ హుస్సేన్

**మనూర్, జూలై 1, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని శలిగిరిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం ఎంపిడిఓ హైమద్ హుస్సేన్ భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి ఇంటి నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా ఎంపిడిఓ హైమద్ హుస్సేన్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు పురంజన్, శ్రీశైలం, లబ్దిదారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

-పిహెచ్‌సి డాక్టర్ జువేరియా బేగం

**నాగల్‌గిద్ద, జూలై 1, ప్రభాతవార్త:**
వానాకాలం ఆరంభం అయినందున సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని, అందుకు ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవనం సాగించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ జువేరియాబేగం సూచించారు. మంగళవారం డాక్టర్ జువేరియాబేగం మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులకు గురయితే వెంటనే ఆశావర్కర్లకు సమాచారం ఇవ్వాలని, ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు ఆసుపత్రిలో పంపిణీకి సిద్దంగా ఉన్నాయని గుర్తుచేశారు. వైద్య సిబ్బంది పిహెచ్‌సి సబ్ సెంటర్‌లలో అందుబాటులో ఉంటూ ప్రజలకు చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణీ స్త్రీలు నెలకు రెండు మార్లు చెకప్ చేయించుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జువేరియాబేగం వివరించారు.

# రామాయంపేట అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తా

-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే రోహిత్‌రావు



రామాయంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట, జూలై 1, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలమును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి శాయశక్తులా కృషి చేయడమే కాకుండా, అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో సుమారు 8కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలసంక్షేమం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తమప్రభుత్వం పని చేస్తుందని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం చేయలేని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఆయన స్పష్టంచేశారు. పట్టణంలోని పలుప్రాంతాల్లో సిసిరోడ్ల నిర్మాణంతో ప్రజలకు మెరుగైనరవాణాసౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీవ్యవస్థతో పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రజల ఆరోగ్యానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. వివిధ కుల సంఘాల ఆత్మగౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇవి సామాజిక కార్యక్రమాలకు, సమావేశాలకు వేదికగా నిలుస్తాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమల సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రావు రామాయంపేటలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. చిత్తారమ్మఆలయం, రైతుబజార్ ఎల్లమ్మఆలయం, మల్లన్నఆలయం, పంచముఖ హనుమాన్‌టెంపుల్, పెద్దమ్మఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు యుగంధర్‌రావు, రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, అధికార పార్టీకి చెందిన నాయకులు గజవాడ నాగరాజు, దేమే యాదగిరి, సుందర్‌సింగ్, అల్లాడి వెంకటి, దేవుని రాజు, చిలుక గంగాధర్, ఎనిషెట్టి అశోక్ గుప్తా, సుంకోజు దామోదర్, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, బండారి మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చింతల యాదగిరి, పిట్ల ప్రకాష్, చింతల స్వామి, డాకీ స్వామి, విప్లవ్, దేవుని నరసింహులు, ఫ్లెక్సీ రవి, గుడాల యాదగిరి, జీడిపల్లి సత్యనారాయణ, కుమార్‌సాగర్, బైరం కుమార్‌తోపాటు స్థానిక

## పేద ప్రజల సొంతింటి కల సాకారం

-కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు



ఇళ్లనిర్మాణానికి భూమిపూజచేస్తున్న కాంగ్రెస్‌నాయకులు హరికృష్ణ, అత్తు

**సిద్దిపేట అర్బన్, జూలై 1, ప్రభాతవార్త:**
పేదప్రజల స్వంతింటి కలను సాకారంచేస్తున్న ఘనత రేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 9,10,11,20,38, 43వ వార్డులలో ఇందిర్మ ఇళ్ల మంజూరైన లబ్దిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి వారు మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేస్తూ స్వంతింటికలను సాకారంచేస్తున్నారని, ఇల్లు మంజూరు కానివారు ఆందోళనచెందాల్సిన అవసరం లేదని దశలవారీగా అర్హులందరికీ మంజూరు అవుతుందన్నారు. బిసి కులగణన చేసి సిఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పేదలసంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, లక్ష్మీ, కలీం, యాదగిరి, పయ్యావుల ఎల్లం యాదవ్, గ్యాధరి మధు, సాంబమూర్తి, నజ్జు, హర్షద్, వాహబ్, రజిని, సంతోష,రాకేష్,రాజు,షాబుద్దీన్, మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడిపిస్తున్న సెయింట్ మేరీస్ విద్యానికేతన్

-పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి
-ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవులపల్లి మహేందర్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎబివిపి నాయకులు

**గజ్వేల్, జూలై 1, ప్రభాతవార్త:**
ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడిపిస్తూ విద్యార్థుల వద్ద అడ్డగోలుగా ఫీజులు వసూలుచేస్తున్న సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దేవులపల్లి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా దేవులపల్లి మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల యూనిఫాం విక్రయిస్తూ భారీగా డబ్బులు దండుకుంటున్నారన్నారు. సరస్వతీనిలయంగా నిలవాల్సిన పాఠశాలలను వ్యాపారకేంద్రాలుగా మారుస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధికఫీజులు వసూలుచేయడమే కాకుండా పుస్తకాలు, స్టేషనరీ పేరుతో తల్లిదండ్రులరక్తాన్ని జలగల్లాపీలుస్తున్న సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాల గుర్తింపును రద్దుచేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైనవిద్యను అందించేదిశగా చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాధికారి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎబివిపి ఉపాధ్యక్షుడు చందు, నవీన్ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్దిదారులకు అందించాలి

-తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా



తహసీల్దార్ కార్యాలయంముందు ధర్నానిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

**జహీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:**
జహీరాబాద్ సమీపంలోని హోతి (కె) గ్రామం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్దిదారులకు అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం నాయకులు లబ్దిదారులతోకలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన నిరసన కార్యక్రమంలో లబ్దిదారులకు 20రోజుల్లో ఇంటితాళాలు ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్పష్టమైన తేదీ ప్రకటించే వరకు ధర్నాను విరమించేది లేదని నాయకులు హెచ్చరించారు. ఈనెల 7వ తారీఖు వరకు ఇళ్లతాళాలు అప్పగిస్తామని రెవిన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో నాయకులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుపతి, సలీం, బక్కన్న, డుబుల్ బెడ్‌రూం లబ్దిదారులు శ్రీనివాస్, శివకుమార్, యాదుల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శ్రీకారం

-25లక్షలతో బాలవిమార్ పార్క్‌లో డెకరేటింగ్ పనులు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 1, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద గల బలవిహార్ పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా మంగళవారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ 25లక్షల రూపాయలతో నిర్మించే డెకరేటింగ్ పనులకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. పార్కులో చేపట్టిన వాకింగ్ ట్రాక్‌పై నీరు నల్చిఉండటాన్ని గమనించిన కార్పొరేటర్ పుష్పనగేస్ ట్రాక్‌పై నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వర్క్ ఇన్స్‌పెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ ఐలాపూర్ ఏలేష్,, ఎల్వర్తి మల్లేష్, సిఎం మల్లేష్, నవీన్ యాదవ్, రవి, హన్మంతు, రమేష్, మల్లేష్, మల్లికార్జున్, సత్యం, ఖాజా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

**నాగల్‌గిద్ద, జూలై 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మోర్గి మోడల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యను అందుకునేందుకు 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ పేర్కొన్నారు. కళాశాలలో సిఈసిలో 15, ఎంపిసిలో 15, సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సువర్ణ వివరించారు.

# కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

-ప్రధానమంత్రికి లక్ష పోస్టుకార్డులు పంపిస్తాం
-సాధనసమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపతుల పరశురాం



కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని ప్రధానమంత్రికి పోస్టుకార్డు పంపుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి టౌన్, జూలై 1, ప్రభాతవార్త:**
కరెన్సీపై ఆర్బీఐ స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని అంబేద్కర్ సాధన జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ఉద్యమం మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉద్యమానికి తన క్యాంప్ కార్యాలయం వద్ద స్వాగతంపలికారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రికి ఎమ్మెల్యే పోస్ట్ కార్డును పంపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలిన సందర్భంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రూపాయి దాని సమస్య పరిష్కారం మార్గం అనేపుస్తకాన్ని వ్రాసి హిల్టానయాంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్ బ్రిటిష్ 1935 ఏప్రిల్ 1న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడేలాచేసిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 5వందల మందితో పోస్ట్‌కార్డులు పోస్టుబాక్సులో వేయడం జరిగిందన్నారు. కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధనసమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ జాతీయ జెండాలో అశోకచక్రం పెట్టినరోజు జూన్ 23 నుంచి 2026 జనవరి 26 వరకు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లక్ష మందితో పోస్ట్‌కార్డ్ ఉద్యమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి సంగారెడ్డి జిల్లా సలహాదారులు యం. అనంతయ్య, అంబేద్కర్‌సంఘం గౌరవ అధ్యక్షులు దుర్గాప్రసాద్, అధ్యక్షులు అశోక్‌కుమార్, దళిత బహుజనసంఘం నాయకులు విజయరావు, మన్నే సాగర్, మొగులయ్య, గొల్ల ఆంజనేయులు, ఆనంద్‌గౌడ్, పురుషోత్తం ప్రమోద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యదినోత్సవం ఘనంగా నిర్వహణ



వైద్యుని సన్మానిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 1, ప్రభాతవార్త:**
జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గుమ్మడిదల ప్రభుత్వ వైద్య వైద్యాధికారి మధుకర్‌ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ ఉదయ్, భిక్షపతిరెడ్డి, మల్లారెడ్డి మెడికల్ కాలేజీ వైద్యులు ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొని శాలువాతో పూలమాలలువేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నేటిసమాజంలో వైద్యుల ప్రాముఖ్యతగురించి చర్చించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్‌ఓ శ్రీనివాసరావు, మల్లారెడ్డి మెడికల్ కాలేజీ వైద్యులు అశ్వినీ, వారిసిబ్బంది ప్రభుత్వ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన కవిత



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, కార్పొరేటర్ సింధూ

**రామచంద్రాపురం, జూలై 1, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయాలకుగురై ఆసుపత్రిలో చికిత్సలు అందుకుంటున్న క్షతగాత్రులను ఎమ్మెల్సీ కవిత, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి డాక్టర్లను కవిత, సింధూలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి డాక్టర్లకు సూచించారు. ప్రమాదంలో ప్రాణాలుకోల్పోయినవారి కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## వైద్య వృత్తి మహావరం

-జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి



వైద్యులను సత్కరిస్తున్న కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు

**హుస్నాబాద్ రూరల్, జూలై 1, ప్రభాతవార్త:**
వైద్య వృత్తి అనేది మహావరం అని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈశిబిరాన్ని ఎమ్‌సి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌లతో కలసి ప్రారంభించారు. నిర్వహించిన వైద్యశిబిరంలో స్త్రీ, పిల్లలు, ఎముకలు, జనరల్, దంతవైద్య నిపుణులతో 238మంది రోగులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సప్తరుషి తెలిపారు. అనంతరం గౌరవ అధ్యక్షులు డాక్టర్ అక్కు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు అందరూ స్థానికులే అని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈప్రాంతంలో పుట్టి ఇక్కడి రోగులకు ఉచితంగా వైద్యం అందించే అవకాశం రావడం పట్ల డాక్టర్లు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, నాయకులు కోమటి సత్యనారాయణ, ఎండి హస్సన్, వల్లపు రాజు, వాల నవీన్, డాక్టర్లు తిరుపతి, ధర్మానాయక్, శ్రీనివాస్, శ్రీకాంత్, సందీప్, రాజన్, దాస్, సంపత్, సురేష్, అన్వేష్, రమాదేవి, విజయలక్ష్మి, సమత, హరిప్రియతోపాటు తదితరులు ఉన్నారు.

**డాక్టర్లను సన్మానించిన ఫార్మాసిస్టులు...**
మంగళవారం డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ మండల కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితవైద్యశిబిరంలో పాల్గొన్నారు. వైద్యులతోకలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీచేశారు. అనంతరం డాక్టర్‌లను శాలువాలతో సత్కరించారు. సత్కరించినవారిలో అసోసియేషన్ అధ్యక్షులు బింగి శ్రీనివాస్, రావుల రంజిత్‌తోపాటు సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా హాతీరామ్ బావోజీ జయంతి వేడుక



హాతీరామ్ బావోజీ జయంతి వేడుకల దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, జూలై 1, ప్రభాతవార్త:**
పట్టణంలోని బంజారా భవన్‌లో మంగళవారం గిరిజనుల ఆరాధ్యదైవం అయిన హాతీరామ్ బావోజీ 596వ జయంతివేడుకలను గిరిజన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహాభోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తమ ఆరాధ్యదైవం అయిన హాతీరామ్ బావోజీ ఆస్తులను హంతకులు నాశనం చేస్తున్నారని, వారి ఆస్తులను బంజారాలకు అప్పగించాలని డిమాండ్‌చేశారు. 2007వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హాతీరామ్ బావోజీ ట్రస్ట్‌కు చైర్మన్‌గా బంజారాలనే నియమించాలని ఆదేశాలు జారీచేసినట్లు గుర్తుచేశారు. ఈ విషయంలో తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు వీరన్ననాయక్, తిరుపతినాయక్, ఎస్పినాయక్, రాజునాయక్, రూప్‌సింగ్, రాజు, రవిందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**చేర్యాల, జూలై 1, ప్రభాతవార్త:**
చేర్యాల పట్టణంలో నూతన ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆకమిటీసభ్యులు ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసుకున్న సమావేశంలో గౌరవ అధ్యక్షులు మలిపెద్ది లింగం, మాజీ అధ్యక్షులు కర్క చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా లింగంపల్లి బాబు, ఉపాధ్యక్షులుగా వల్లూరి విజేయ్,కోశాధికారి తౌట సురేష్‌లు నియమించబడ్డారు.సభ్యులు గుడాల రాజు,ఇప్పకాయలపవన్,శ్రీనివాస్,భాస్కర్,యాదగిరి,తాడూరివిష్ణు, మాదాసునర్సింగరావు,భూమిగారిరాజేశ్,ఆకులరాజు పాల్గొన్నారు.